ప్రతి విద్యార్థికి టెన్త్ మైలురాయి

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో అదనపు కలెక్టర్లు, డీఈవో

- ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- పాల్గొన్న అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, డీఈవో

రంగారెడ్డి, మే 30 (నమస్తే తెలంగాణ) : ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి మైలు రాయి లాంటిదని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాలు-2024 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 50,807 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా.. అందులో 46,245 మంది ఉత్తీర్ణత సాధించారని.. ఉత్తీర్ణతా శాతం 82.22గా నమోదైందన్నారు. 36 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా.. 10/10 గ్రేడ్ పాయింట్లు 50 మంది విద్యార్థులకు వచ్చాయన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన బడుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు కష్టపడితేనే ఈ విజయం సాధ్యమైందన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. టెన్త్‌లో 10/10 సాధించిన విద్యార్థులు, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, సబ్జెక్టు రిసోర్స్ టీచర్లు, కో-ఆర్డినేషన్ బృందాలకు కలెక్టర్ పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సబ్జెక్టు రిసోర్స్ ఉపాధ్యాయులు, కో-ఆర్డినేషన్ టీం సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులున్నారు.

ప్రతి గింజనూ కొంటాం

- జిల్లాలో 38వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం
- 40కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేశాం
- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల : ముజాహిద్‌పూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల, మే 30 : రైతులు పండించే ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కులకచర్ల మండల ముజాహిద్‌పూర్, కుస్మసముద్రం గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే రైస్ మిల్‌లకు చేరవేస్తారన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ధాన్యం తడువకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్రాల నుంచి వచ్చే వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అలసత్వం వహించకుండా లారీల నుంచి వెంటవెంటనే అన్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రైస్ మిల్లుల సామర్థ్యం ప్రకారం మిల్లింగ్ చేసిన బియ్యాన్ని(సీఎంఆర్) నిర్ణీత గడువు లోపు ఎఫ్‌సీఐకి చేరవేసేలా చూడాలని రైస్ మిల్లర్ల యజమానులకు ఆయన సూచించారు. వరి ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 40 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. ఇప్పటికే 90 శాతం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించడం జరిగిందని, ధాన్యం కొనుగోలు తుదిదశకు చేరిందని ఆయన తెలిపారు. ఆకస్మిక తనిఖీలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వరి, తహల్దార్ మురళీధర్ పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

దోమ : రైస్ మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. దోమ మండల పరిధి మోత్కూర్ గ్రామంలోని మహాలక్ష్మి రైస్ మిల్లును ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మిల్లింగ్ చేసిన బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు

వీసీల ఎంపికలో మంత్రి పొంగులేటి జోక్యం తగదు

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 30 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఉప కులపతి(వైస్ చాన్స్‌లర్) ఎంపిక ప్రక్రియలో రాజకీయ పార్టీల నేతల జోక్యం తగదని వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేశారు. గురువారం వర్సిటీలో నిరసన తెలుపుతూ సీఎం, గవర్నర్‌లకు పోస్ట్‌కార్డుల ద్వారా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మిత్రుడు ఎస్వీ కోటిరెడ్డిని నియమించడం తగదని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు విశ్వవిద్యాలయంలో పనిచేసే వ్యక్తులను కాకుండా ప్రభుత్వ వర్సిటీలో పని చేసే ప్రొఫెసర్లకు అవకాశం కల్పించాలని కోరారు. మంత్రి పొంగులేటి తమ పరిచయాలను విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఉపయోగించుకోవాలని కోరారు. వీసీ ఎంపిక ప్రక్రియలో మంత్రి జోక్యం చేసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న వేద పండితుడు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కనులపండువగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, భక్తులు

కడ్తాల్, (తలకొండపల్లి) మే 30 : తలకొండపల్లిలో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. వేద పండితులు శ్రీనివాసమూర్తి, మురళీశర్మ, నర్సింహశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, తలకొండపల్లి జడ్పీటీసీ వెంకటేశ్, మంజుల దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కలాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కల్యాణోత్సవంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ నిర్వాహకులు సన్మానించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అఖిల్, అనిల్, ఎంపీపీ నిర్మల, మాజీ జడ్పీటీసీ నర్సింహ, నాయకులు శ్రీశైలం, మోహన్‌రెడ్డి, జ్యోతయ్య, గోపాల్, లక్ష్మణ్, శ్రీశైలం, శేఖర్, యాదయ్య, విఠల్, రవి, అంజయ్య పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

ప్రభుత్వ అనుమతులున్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

షాబాద్, మే 30 : ప్రభుత్వ అనుమతులు ఉన్న డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. గురువారం శంకర్‌పల్లిలో పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేసే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత సంవత్సరం శంకర్‌పల్లి మండలానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 140 క్వింటాళ్లు పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేయగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 262 క్వింటాళ్లు జనుము, జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులకు విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమాదేవి, మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, ఏఈవోలు రామకృష్ణారెడ్డి, రమ్య, మౌనిక, షీల పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వెంటనే పూర్తి చేయాలి

ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న డీఈవో సుశీందర్‌రావు

- డీఈవో సుశీందర్‌రావు
- గడ్డమల్లయ్యగూడ, మాల్ గ్రామాల్లో పర్యటన

యాచారం, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వీలైనంత త్వరలో పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ, మాల్ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించిన పలు విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభించని పాఠశాలల్లో పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, నాణ్యతా ప్రమాణాలతో కూడిన పనులు చేపట్టాలని సూచించారు. నాసిరకం పనులు చేపడితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగన్నాథ్, శ్రీలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలి

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీలత తదితరులు

డీఆర్‌డీవో శ్రీలత

యాచారం, మే 30 : జాతీయ ఉపాధి హామీ పనులను మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి శ్రీలత అన్నారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ఆమె గురువారం పర్యటించి ఉపాధి కూలీలు చేపట్టిన పనులను పరిశీలించారు. పనులకు సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. అనంతరం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ సహకారంతో పెంచుతున్న సీతాఫలం తోటను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శ్రీలత మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి తప్పనిసరిగా పని కల్పించాలని అధికారులకు సూచించారు. రోజువారీ రికార్డులను ఫీల్డ్ అసిస్టెంట్లు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న హరితహారానికి మొక్కలను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ఏపీడీ సక్రియా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 30 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండు, మూడు, అయిదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫీజును వచ్చే నెల 3లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ బీఈ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ (నాన్ సీబీసీఎస్) సప్లిమెంటరీ, బీఈ (ఏఎంసీటీఈ) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీఈ (సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని ఆయన చెప్పారు.

వదంతులు నమ్మొద్దు

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- అందుబాటులో 1,778 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు
- నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

వానకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ విలేకరుల సమవేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,778 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచగా.. ఇప్పటివరకు 1,584 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంకా 194 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పత్తి విత్తనాలు 4,91,036 ప్యాకెట్లు అవసరం ఉండగా.. 1,78,554 ప్యాకెట్లు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసి ఉంచినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి ప్రతిరోజూ కావాల్సిన ప్యాకెట్లను డీలర్స్ వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో పచ్చిరొట్ట, పత్తి విత్తనాల కొరత లేదని.. రైతులు వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్ కంపెనీల ద్వారా మార్కెట్లో చెలామణి అయ్యే అన్ని రకాల విత్తనాలను క్రమబద్ధీకరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాల బెడద లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ సీడ్ జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గడువు ముగిసిన విత్తనాలను, లైసెన్స్ లేకుండా విక్రయించే వాటిని, ఒక ప్రాంతంలో లైసెన్స్ కలిగి ఉండి వేరే చోట విక్రయాలు జరిపే వారిపైనా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి, సంబంధిత అధికారులున్నారు.

భూ ఆక్రమణపై రెవెన్యూ పంజా

కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి కబ్జాకు యత్నం

తొమ్మిదెకరాల 36 గుంటల భూమిపై కాంగ్రెస్ నేత పట్టా

కలెక్టర్ శశాంక చొరవతో ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డును ఏర్పాటు చేసిన గండిపేట రెవెన్యూ అధికారులు

బండ్లగూడ, మే 30 : భూ ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులు పంజా విసిరారు. కోటాను కోట్ల రూపాయల విలువైన సర్కారు భూమిని కబ్జాదారుల చెర నుంచి గండిపేట రెవెన్యూ అధికారులు కాపాడారు. స్థానికంగా ఓ కాంగ్రెస్ నేత అడ్డగోలు భూకబ్జాల నిర్వాకంతో గంధంగూడలో తొమ్మిది ఎకరాల 36 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు రక్షించగలిగారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొన్ నియోజకవర్గం నాయకుడు గండిపేట మండలం పరిధిలోని ప్రభుత్వ భూమిపై కన్ను వేసి, గత కొంత కాలంగా దానిని కబ్జా చేయాలని కుట్ర పన్నాడు.

ఇందులో భాగంగా గండిపేట మండలం పరిధి గంధంగూడ సర్వే నం. 51లో తొమ్మిదెకరాల 36 గుంటల ప్రభుత్వ స్థలం ఉండగా, ఆ నాయకుడు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై వారి అండదండలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి పట్టా చేయించుకున్నాడు. ఆ స్థలంలో రేకుల షెడ్లను నిర్మించి అమ్మకాలు చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు. కాగా, ఈ స్థల విషయంపై రంగారెడ్డి లెక్టర్ శశాంకకు అనేక ఫిర్యాదులు అందడంతో ఆయన క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి రికార్డులను పరిశీలించారు. ఆ స్థలం ప్రభుత్వ భూమి అని తేలడంతో ఆయన పట్టాను రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రంరెడ్డి, సురేశ్ రంగంలోకి దిగి పోలీసుల బందోబస్తు మధ్య బుధవారం తెల్లవారు జామున ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్లలను తొలగించి అక్కడ ప్రభుత్వ స్థలం అని బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ నాయకుడి వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

- ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ భాస్కర్
- హైటెక్స్‌లో ఫార్మాలిటికా - 2024 ఎక్స్‌పో ప్రారంభం

భారతీయ ఫార్మాలో గణనీయమైన వృద్ధి

హైటెక్స్‌లో ఫార్మాలిటికా - 2021 ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ తదితరులు

మాదాపూర్, మే 30: కొవిడ్ తరువాత భారతీయ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ గణనీయమైన తోడ్పాటును అందించిందని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఫార్మాలిటికా - 2024 ఎక్స్‌పోకు ముఖ్య అతిథిగా ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొవిడ్ మహమ్మారి తరువాత ఫార్మాస్యూటికల్ పరిశ్రమ గణనీయమైన తోడ్పాటును అందిస్తున్నదన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో యూఎస్‌డీ 27.8 బిలియన్ల విలువైన ఔషధాలను ఎగుమతి చేసినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ 9.6 శాతం వృద్ధి రేటును సాధించామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 31 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఎగుమతుల్లో 50 శాతం అధిక నియంత్రణ కలిగిన మార్కెట్‌లకు వెళ్తున్నాయన్నారు. అనంతరం, భారత్, టర్కీ మధ్య ఫార్మా కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్ మార్కెట్ మాట్లాడుతూ.. భారతదేశానికి ఫార్మా రాజధానిగా హైదరాబాద్ మారుతున్నదన్నారు. భారత దేశం, టర్కీ రెండు ఈ రంగంలో ఎదుగుతున్నట్లు చెప్పారు. ఇన్‌ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ మాట్లాడుతూ.. భారతదేశం యొక్క బల్క్ డ్రగ్ ఉత్పత్తికి కేంద్రంగా హైదరాబాద్ వెలుగొందుతున్నదన్నారు. అభివృద్ధి చెందుతున్న పోకడలు, సవాళ్లు వాటాదారులకు కీలకమైన వేదికగా ఫార్మాలిటికా వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్, ఇండియన్ ఫార్మాకోపోయియా కమిషనర్ గౌరవ్ ప్రతాప్ సింగ్, ప్రపంచ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్, బోర్డు సభ్యుడు ఏవీపీఎస్ చక్రవర్తి, బీడీఎంఏ (బల్క్ డ్రగ్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్) జాతీయ అధ్యక్షుడు ఆర్‌కే అగర్వాల్, సౌత్ ఏషియా వెయోలియా వాటర్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ బిజినెస్ లీడర్ గోపాల్, ఇన్ఫార్మా మార్కెట్స్ సీనియర్ గ్రూప్ డైరెక్టర్ రాహుల్ దేశ్ పాండే, ఇన్ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ పాల్గొన్నారు. కాగా, 80కి పైగా ఫార్మా కంపెనీలకు చెందిన స్టాల్స్‌లో వారి ఉత్పత్తులు, ఔషధాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 30 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్) ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 19వ తేదీ నుంచి, ఎంసీఏ అన్ని సెమిస్టర్ల ప్రాక్టికల్ పరీక్షలను వచ్చే నెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

జాయింట్ సెక్రటరీ బరిలో విజయ్ కుమార్

మాదాపూర్ : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బరిలో తెలంగాణ హాకీ అధ్యక్షుడు, చందానగర్ నివాసి కొండా విజయ్‌కుమార్ ఉన్నారు. ఫతేమైదాన్ తెలంగాణ ఒలింపిక్ భవన్‌లో ఎన్నికల అధికారికి గురువారం నామినేషన్ సమర్పించారు. జూన్‌లో ఒలింపిక్ భవన్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ప్యానెల్ నుంచి తాను పోటీ చేయనున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు.